పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

సీపీఐ అల్లూరి జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

విశాలాంధ్ర - జి.మాడుగుల: సీపీఐ పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని సీపీఐ అల్లూరి జిల్లా కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. మండలంలోని కిల్లంకోట పంచాయతీ సుబ్బులు గ్రామంలో సీపీఐ మండల సమితి సమావేశం గురువారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య అల్లూరి జిల్లా సహాయ కార్యదర్శి సెగ్గే లక్ష్మణ్ అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. పార్టీ బలోపేతం చేయాలనే దృక్పథంతో ప్రతి ఒక్కరు సమష్టిగా పనిచేయాలని, ఈ క్రమంలోనే ప్రజా సంఘాలు బలోపేతం చేయాలని సూచించారు. రాబోయే 2024 ఎన్నికలలో అల్లూరి జిల్లా పాడేరు నియోజకవర్గం నుండి సీపీఐ పోటీ చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. పాడేరులో ఎర్రజెండా ఎగురవేసేందుకు ఇప్పటినుంచే పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ మండల కార్యదర్శిగా కంచంగి లక్ష్మణ్ ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ సమితి సభ్యులు శాంతి బాబు, గణేష్, దావీద్ పాంగి లక్ష్మణ్ పాల్గొన్నారు.

రహదారిపై పడిన పెద్ద గుంతలను పూడ్చాలి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: మండలంలోని తుమ్మపాల చినబాబు కాలనీ ప్రధాన రహదారిపై పెద్ద గుంత పడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి వియ్యపు రాజు అన్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు- ఇటు ప్రజా ప్రతినిధులు చోద్యం చూస్తున్నారే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం చాలా దుర్మార్గమని అన్నారు. గురువారం ఆయన రోడ్డును పరిశీలించి మాట్లాడారు. అనకాపల్లి నుండి చోడవరం వెళ్లే మార్గ మధ్యలో ఉన్న దర్జీ నగర్ కాలనీ మామిడిపాలెం, చోడవరం చేరుకునే వరకు ప్రధాన రహదారులు పెద్ద పెద్ద గుంతలతో వర్షపు నీరుతో మునిగి ఉండడంతో రోజు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని దీనిపై తక్షణమే చర్యలు తీసుకొని మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్ చేశారు. 15 రోజుల వ్యవధిలో ప్రధాన రహదారులు మరమ్మతులు చేపట్టకపోతే ఆందోళన చేపతామని హెచ్చరించారు.

అట్రాసిటీ కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు : అట్రాసిటీ కేసుల సత్వర పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేసారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో గురువారం జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. చింతపల్లి, రంపచోడవరం సబ్ డివిజనల్ పోలీస్ అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. జిల్లాలో 134 కేసులు ఉన్నాయని పూర్తి స్థాయిలో విచారణ జరిపి చార్జిషీట్ వేయాలన్నారు. పాఠశాలలు, గ్రామ పంచాయతీలలో సివిల్స్ డే కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కేసుల పరిష్కారానికి కులధృవీకరణ పత్రాలు లేకపోవడం వలన ఇబ్బందులున్నాయని పోలీస్ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకునిరావడంతో సానుకూలంగా స్పందించారు. ఐటీడీఏ పీఓలకు రాసి కులధృవీకరణ పత్రాలు పొందాలని సూచించారు. ఈ సమావేశంలో పాడేరు ఎ ఎస్పి కె. ధీరజ్, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు జి.జనార్దన రావు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండల రావు, కార్మిక శాఖ సహాయ కమీషనర్ టి.సుజాత, రంపచోడవరం ఎటిడబ్ల్యూఓ రామ తులసి, ఎస్ డబ్ల్యూ ఓ డి.ఎల్.ఆనందరావు, కమిటీ సభ్యులు చెండా లోహితాస్, పలాసి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు అక్రమం

టీడీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అనిత

విశాలాంధ్ర - యస్.రాయవరం: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టు అక్రమం అని రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత అన్నారు. గురువారం మండలంలో గుడివాడ పంచాయతీ పరిధిలో కొత్త పోలవరం లక్ష్మీపతి రాజుపేట గ్రామాల్లో టీడీపీ కాగడాల ప్రదర్శన చేపట్టింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం ఆలోచించే నాయకుడు చంద్రబాబు నాయుడు అని అటువంటి నాయకుడిపై అవినీతి మరక వేసి అరెస్ట్ చేశారన్నారు. ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి పాయకరావుపేట నియోజకవర్గానికి అభివృద్ధికి తోడ్పడిన వ్యక్తి చంద్రబాబు నాయుడు అని గ్రామదర్శిని పేరుతో గుడివాడ గ్రామంలోని ప్రజలతో మమేకమైన విషయాలు గుర్తుకొస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పాయకరావుపేట నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు యనమల కృష్ణుడు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు అమలకంటి అబద్ధం, కొప్పిశెట్టి వెంకటేష్, జానకి శ్రీను, పెద్దిరెడ్డి చిట్టిబాబు, టిడిపి సీనియర్ నాయకులు ఎన్.వెంకట్ రాజు, కురందాసు నూకరాజు, గుర్రం రామకృష్ణ, కొప్పి శెట్టి బుజ్జి, పల్లెల బుజ్జి, అల్లు నరసింహ మూర్తి, పెద్దిరెడ్డి శ్రీను ,తన్నీరు ఎరకయ్య, చింతకాయల రాంబాబు ,మాజీ జెడ్పిటిసి బోట్టా లక్ష్మీ,మండల తెలుగు యువత అధ్యక్షుడు సుంకర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సముద్రం వద్ద టీడీపీ నిరసన

విశాలాంధ్ర - పాయకరావుపేట: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా పార్టీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు ఆధ్వర్యంలో మండలంలోని రాజవరం సముద్ర తీరం వద్ద నాయకులు నిరసన తెలిపారు. పార్టీ జెండాలు చేతబూని జగన్మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చంద్రబాబు నాయుడును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, బొంది కాశీవిశ్వనాద్, పల్లా విలియంకేరి, లెక్కల గోవిందు నాయుడు, పెదిరెడ్డి నాగ వెంకటరమణ, జూరెడ్డి ప్రసాద్, కట్టా శ్రీను, ఏడిద సురేష్, వేములపూడి అప్పారావు, గణపర్తి దొర, రోకళ్ల తాతారావు, చిరుకూరి పేర్రాజు, రాజాన ఆది, పలువురు మహిళలు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో గిరిధర్‌కు బంగారు పతకం

విశాలాంధ్ర - పాయకరావుపేట: పట్టణంలోని శ్రీచైతన్య ఇంగ్లీషు మీడియం పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న జానా గిరిధర్ కిక్ బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించినట్లు కోచ్ రామకృష్ణ తెలిపారు. అండర్ - 14లో 30 నుండి 32 కిలోల బరువు కేటగిరిలో గోవా లో జరిగిన పోటీల్లో గిరిధర్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. ఈ పోటీల్లో తెలంగాణా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, హర్యానా రాష్ట్రాలకు చెందిన క్రీడా కారులు పోటీల్లో పాల్గొన్నారు. బంగారు పతకం సాధించిన గిరిధర్‌ను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

విశాలాంధ్ర - అనంతగిరి: అనంతగిరి మండలంలోని నాన్ షెడ్యూల్ గరుగుబిల్లి పంచాయతీ పరిధి కోరుమనువలస గ్రామంలో తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని మహిళలు ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. బోరు మరమ్మతు పనులు చేపట్టాలని సంబంధిత అధికారులు, పంచాయతీ ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకునే నాధుడే కరువయ్యారని మహిళలు విమర్శించారు. వార్డు మెంబర్ సన్యాసమ్మ మాట్లాడుతూ గ్రామంలో బోరు మరమ్మతు చేపట్టకపోవడంతో కలుషితమైన గెడ్డ నీటిని ఆశ్రయిస్తున్నారని తెలిపారు. దీంతో గిరిజనులు రోగాల బారిన పడుతున్నారని అన్నారు. అధికారులు తక్షణమే స్పందించి బోరు మరమ్మతు పనులు చేపట్టి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన మహిళలు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో టీడీపీదే గెలుపు

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: రాబోయే ఎన్నికల్లో టీడీపీ విజయాన్ని ఆపలేరని, ఈ నేపథ్యంలో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు అధికార పగ్గాలు చేపట్టడం తథ్యమని గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. బాబు అరెస్టును నిరసిస్తూ మండలంలోని కించుమండ గ్రామంలో గురువారం జరిగిన రిలే నిరాహార దీక్ష కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం సాగిస్తున్న అరాచకా పాలనకు ప్రజలు తిప్పి కొట్టె రోజులు వస్తుందని ఎటువంటి ఆధారాలు లేనప్పటికి చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపించడం చాలా దారుణమని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ కోశాధికారి వంతల నాగేశ్వరరావు, మండల అధ్యక్షులు తుడుము సుబ్బారావు, అరకువేలి మండల అధ్యక్షులు శెట్టి బాబురావు, అరకు పార్లమెంట్ ఎస్టి సెల్ ఉపాధ్యక్షులు కమిడి సుబ్బారావు, అరకు పార్లమెంట్ టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి ఎం.స్వామి, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

యాంటీ లార్వా ఆపరేషన్‌కు తాత్కాలిక సిబ్బంది నియామకం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా లాంటి వ్యాధులు నివారణ కొరకు జీవిఎంసి పరిధిలో యాంటీ లార్వాల్ ఆపరేషన్ కొరకు 399 మంది సీజనల్ సిబ్బందిని నెల రోజుల (30 రోజులు) కొరకు తాత్కాలిక పద్ధతిపై నియమించడం జరిగిందని జీవిఎంసి అదనపు కమీషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్ తెలిపారని బయాలజిస్ట్ సాంబమూర్తి గురువారం పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. డెంగ్యూ తీవ్రతను బట్టి సీజనల్ సిబ్బందిని కొనసాగించడం లేదా తొలగించడం జరుగుతుందని, కావున ప్రస్తుతం నియమించిన సిబ్బంది తాత్కాలిక ప్రతిపాదికన మాత్రమే నియమించడం జరిగిందని, అందుకు వారు ఎటువంటి దళారుల మాటలకు గాని, ప్రలోభాలకు మోసపోవద్దని జీవిఎంసి అదనపు కమిషనర్ తెలిపారని బయాలజిస్ట్ తెలిపారు.

గోస్తని నదిలో పడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం పద్మనాభం గ్రామానికి చెందిన శిల బుచ్చిబాబు (53) గోస్తని నదిలో పడి మృతి చెందినట్లు పద్మనాభం పోలీసులు తెలిపారు. ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ప్రకారం మృతుడు తన భార్య గౌరీతో కలిసి పద్మనాభం గోస్తని నది ఒడ్డున కట్టెలకు వెళ్లి పని పూర్తయ్యాక భార్యను ఇంటికి పంపివేసాడు. బుచ్చిరాజు స్నానానికి గోస్తనీలో దిగి మునిగిపోయాడు. నదిలోఎంత గాలించినా ఫలితం లేకపోయింది. చివరికి నదిలో మృతదేహం తేలియాడుతూ కనిపించింది. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బుచ్చిరాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

యూపీఎస్సీ కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: యూపీఎస్సీ నిర్వహించబోతున్న కంబైన్డ్ రిక్రూట్మెంట్ టెస్ట్ 2023 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ రావు అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో యూపీఎస్సీ పరీక్షలకు సంబంధించి నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈనెల 7, 8 తేదీల్లో యూపీఎస్సీకి సంబంధించి కంబైన్డ్ రిక్రూట్మెంట్ టెస్ట్ 2023 పోటీ పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. ఈ పరీక్ష జిల్లాలో 4 సెంటర్లలో నిర్వహిస్తున్నామని, మొత్తం 2962 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. 7 వ తేది శనివారం మధ్యాహ్నం 2 గంటల నుండి 4 వరకు కార్పొరేట్ ఫ్రాడ్స్ లాస్ అండ్ రెగ్యులేషన్స్ పరీక్ష, 8 వ తేది ఆదివారం ఉదయం 9:30 నుండి 11:30 వరకు సివిల్ ఇంజనీరింగ్ , మధ్యాహ్నం 2 గంటల నుండి 4 గంటల వరకు ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పరీక్షలు నిర్వహించబడతాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో యూపీఎస్సీ అబ్జర్వర్ ఎస్ హెచ్ రాహుల్ గార్గ్, పరీక్షల విభాగం సూపరింటెండెంట్ పాల్ కిరణ్ పాల్గొన్నారు.

గీతం జాతీయ స్థాయి మూట్‌కోర్టు పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలో జాతీయ స్థాయి మూట్ కోర్టు పోటీలు గురువారం ప్రారంభం అయ్యాయి. గీతం మూట్, అడ్వకసీ కమిటి ఆధ్వ ర్యంలో అక్టోబర్ 8వ తేదీ వరకు గీతం వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్. మూర్తి పేరుతో ఈ పోటీలను వర్చ్యువల్ విధానంలో ప్రముఖ న్యాయ నిపుణల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. కాగా పోటీలను లాంఛనంగా ప్రారంభించిన గీతం ప్రో వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ మూట్‌కోర్టు పోటీల నిర్వహణ ద్వారా విద్యార్థుల ప్రతిభను వెలికి తీయ వచ్చునన్నారు. న్యాయ విద్యను అభ్యషించే యువతకు వృత్తిలో ప్రవేశించడానికి ముందు ప్రాక్టికల్ శిక్షణగా మూట్‌కోర్టు పోటీలు ఉపయోగ పడతాయన్నారు. కార్యక్రమంలో విశాఖ పట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వి.రవీంద్రప్రసాద్, గీతం న్యాయ కళాశాల డైరక్టర్ ప్రొఫెసర్ అనితారావు, మూట్ కోర్టు పోటీల నిర్వహణ కమిటి కన్వీనర్ వర్ధమాన్ పొవ పాల్గొన్నారు.

కళలను అభివృద్ధి చేయాలి

వైసీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు వంగపండు ఉష

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: కలలను అభివృద్ధి చేసి, కళాకారులను ప్రోత్సహించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని రాష్ట్ర సాంస్కృతిక విభాగం చైర్ పర్సన్ వంగపండు ఉష అన్నారు. గురువారం వైసీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. లైఫ్ అచీవ్‌మెట్ అవార్డ్స్ ఇవ్వడం పట్ల ఆమె ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతి ఒక్క కళాకారులకి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నది ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. అన్ని జిల్లాల నుంచి ఈ గుర్తింపు కార్డులు తీసుకోవాలని కళాకారులకు తెలిపారు. అలాగే నాటక, నంది అవార్డ్స్ ఇవ్వలేదని ప్రతిపక్షాలు ఎన్నో విమర్శలు చేస్తున్నాయని, వాటి నోరు మూయించే విధంగా ప్రభుత్వం నంది అవార్డ్స్ ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. ఈ సమావేశంలో సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జ్ వంకాయల మారుతీ ప్రసాద్, విశాఖపట్నం జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు బయ్యవరపు రాధా, నంది అవార్డుల ఎంపి కమిటీ న్యాయ నిర్ణేత కురిటి సత్యం నాయుడు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో మెరుగైన వైద్య సేవలు

విశాలాంధ్ర - కె.కోటపాడు: మెరుగైన వైద్య సేవలు అందించడమే జగనన్న సురక్ష లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. గురువారం ఏ.కోడూరులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రార ంభించి మాట్లాడారు. వాలంటీర్ల ద్వారా ముందుగానే ఇంటింటికి వెళ్లి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని అవసరమైన వారందరికీ స్పెషలిస్ట్ వైద్యులచే వైద్యం అందజేయడం గ్రామీణ ప్రాంత ప్రజలకు సువర్ణావకాశమని అన్నారు. అంతకు ముందు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాళ్లను పరిశీలించారు. వైద్యులు డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ రామారెడ్డి, డాక్టర్ నిర్మల, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ శైలజ సురేష్‌లు వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, సర్పంచ్ బొడ్డు అక్క నాయుడు, ఎంఈఓ 2 ప్రసాద్, హెల్త్ సూపర్వైజర్లు జవ్వాది సన్యాసిరావు, ప్రమీల, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: ప్రజల చెంతకే మెరుగైన వైద్యం అందించ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అరుదైన అవకాశమని ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పీటీసీ సభ్యులు దీసరి గంగరాజు అన్నారు. ఎగువసోభ పంచాయతీ కొత్తవలస గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. గ్రామాల్లో ఇంటింటా సర్వే నిర్వహించి ప్రజల ఆరోగ్య విశేషాలను తెలుసుకొని అవసరమైన మేరకు వైద్య సేవలను అందించేందుకు ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొర్రా సింహాద్రి, ఆర్ ఐ శంకర్‌రావు, డాక్టర్ జాహ్నవి, వివిధ శాఖల అధికారులు, వైద్య సిబ్బంది స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పరవాడ: ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిదేనని ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి, జడ్పీటీసీ పైల సన్యాసిరాజు అన్నారు. పరవాడ మండలం నాయుడుపాలెం మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తుందన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మెరుగైన వైద్య సేవలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బూస అప్పలరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, పీహెచ్‌సీ వైద్యాధికారి కనకప్పారావు, నాయకులు వెన్నెల సన్యాసిరావు, కూండ్రపు సీతారామయ్య, మైలపల్లి అప్పన్న, చల్లా కనకరావు, పంచాయతీ కార్యదర్శులు రమేష్, మురళి పట్నాయక్, వైద్య సిబ్బంది, వాలంటీర్‌లు తదితరులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: మండలంలో గల జోలపుట్టు పంచాయతీ పరిధి వనసపుట్టు పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. జోలపుట్ పంచాయతీ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆవరణలో గురు వారం సర్పంచ్ నీలకంఠం దొర ఆధ్వర్యంలో జగనన్న సురక్ష ప్రత్యేక వైద్య శిబిరంలో 648 మంది గిరిజన ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నీలకంఠం మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో కిరణ్ కుమార్, వైద్య నిపుణులు రమేష్, ఎస్.శ్యాం ప్రసాద్, ప్రతాప్, సిహెచ్ సుమతి, ఏ.మౌనిక, డి.సునీత, ఎంపిటీసి కమల, వైసిపి నేత జగబంధు, గ్రామ సచివాలయ కార్యదర్శులు డి.ప్రవీణ్ కుమార్, వి.గంగాధర్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు

విశాలాంధ్ర - నక్కపల్లి: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని, ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ప్రజల కోసం నిరంతరం మంచి పాలన అందిస్తున్నారని పాయకరావుపేట నియోజక వర్గ శాసన సభ్యులు గొల్ల బాబూరావు అన్నారు. మండలంలో గురువారం నక్కపల్లి గ్రామంలో శెట్టిబల్జీపేట, కర్రివీధి, కొత్తపేట, రెల్లికాలనీలో గడపగడప కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ మేరకు ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, వైఎస్ ఎంపీపీ వీసం నానాజీ, సర్పంచ్ నేతల జయరత్న కుమారి, పలువురు వైకాపా నాయకులు, కార్యకర్తలు అధికారులు స్వాగతం పలికారు. ప్రభుత్వ పథకాలు అందకపోతే అధికారులకు తెలియపరచాలని, తక్షణమే చర్యలు చేపట్టడం జరగుతుందన్నారు. గ్రామంలో పలు సమస్యలపై పలువురు వినతి పత్రాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు ఏవో సీతారామరాజు, తహశీల్దార్ అంబేద్కర్, వైకాపా మండల పార్టీ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, లొడగల చంద్రరావు, సూరకాసులు గోవిందు, అల్లాడ కొండబాబు, జనపరెడ్డి శేషారత్నం పంచాయితీ కార్యదర్శి రాజశేఖర్, పలువురు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి దృష్టికి నకిలీ సర్టిఫికెట్ వ్యవహారం

విశాలాంధ్ర - అరుకులోయ: బోగస్ క్యాస్ట్ సర్టిఫికెట్లను జారీ చేస్తున్న రెవెన్యూ అధికారులపై చర్య తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తున్నామని అలాగే ఈ విషయంపై ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు వైసీపీ అల్లూరి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ తడబారికి సురేష్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన విశాలాంధ్ర ప్రతినిధితో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో గిరిజనుల మనుగడ దెబ్బతినేలా గిరిజనేతరులకు ఎస్టీ కుల ధృవీకరణ పత్రాలను జారీ చేస్తున్నారని అన్నారు. విలువైన భూములు కాజేయడానికి గిరిజనుల పేరుతో సర్టిఫికెట్లను తీసుకొని వారి పిల్లలకు ఉన్నత చదువులు చదివించి ఉన్నతమైన ఉద్యోగాలను కూడా పొందుతున్నారని అన్నారు. దీనివల్ల గిరిజనులు నష్టపోతున్నారని అన్నారు. బోగస్ సర్టిఫికెట్ తీసుకొన్న పిట్టల రాంబాబు అనే వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని రాంబాబుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

జిల్లా స్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికలు

విశాలాంధ్ర - భీమిలి: విశాఖపట్నం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ టి. నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ఈ నెల 10వ తేది నుండి బాలురు, బాలికలు అండర్ 14,17 నెట్ బాల్ సెలక్షన్స్, ట్రయల్స్‌ను నిర్వహిస్తున్నట్టు ప్రదానోపాధ్యాయులు పి.అరుణ్‌కుమార్ తెలిపారు. భీమిలి సన్ స్కూల్ నందు జీఎస్టీ అధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వీనుల విందుగా ఆర్జిత సేవలు



విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీవరాహ లక్ష్మీ నృసింహ స్వామివారి దేవస్థానంలో గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఆలయ ఏ.ఈ.ఓ సూర్య భ్రమరాంబ, పర్యవేక్షకులు సునిల్ ఆధ్వ ర్యంలో వేదపండితుల వేదమంత్రాల, నాదస్వర మంగళ వాయిద్యాల నడుమ వేకువ జామున సింహాద్రి నాధుని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు.

మద్యం ప్రియులను దోపిడీ చేస్తున్న అబ్కారీ

విశాలాంధ్ర - ఆనందపురం: మద్యం ప్రియులను అవకాశంగా చేసుకొని అబ్కారీ శాఖ భారీ దోపిడీ చేస్తుంది. ప్రీమియం బ్రాండ్లపై ఎమ్మార్పీ కన్నా అదనంగా 500 నుండి 1000 రూపాయలు వరకు బార్ అండ్ రెస్టారెంట్లు వసూలు చేస్తున్నాయి. ఇది ప్రభుత్వం చేస్తుందా లేక వ్యాపారస్తులు సిండికేట్‌గా చేస్తున్నారా అనేది మద్యంప్రియులు తలబాదు కుంటున్నారు. అలాగే బార్ అండ్ రెస్టారెంట్‌లో త్రాగిన దానికి అదనంగా వసూలు చేసుకుని బయటికి పట్టుకెళ్లే మద్యానికి మాత్రం అదనం రేట్లు భారీగా పెరగడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొన్ని బార్ అండ్ రెస్టారెంట్లో దొరకని మద్యం కొన్ని బార్లలో ఎమ్మార్పీ రేట్లకు దొరుకుతుంది. కొన్ని రెస్టారెంట్లో మాత్రం అదనంగా వసూలుకు పాల్పడుతున్నారని మద్యం ప్రియులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మేల్కొని అదనంగా వసూలు చేసే రుసుమును అరికట్టాలని మద్యం ప్రియులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సమస్యలపై వైసీపీ సర్పంచ్‌లు వినతులు ఇవ్వడం విడ్డూరం



విశాలాంధ్ర - వి.మాడుగుల: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో మాడుగుల మండ లంలో గల వైసిపి పార్టీకి చెందిన గ్రామ పంచాయతీ సర్పంచులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రాలు ఇవ్వడం విడ్డూరంగా ఉందని మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు పైలా ప్రసాదరావు విమర్శించారు. అధికార వైసిపి పార్టీ సర్పంచులే దిక్కులేని పరిస్థితుల్లో ఇలా వినతులు చేసుకుంటే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశించారు. పంచాయితీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసి, నిధులను పక్కదారి పట్టిస్తున్న ప్రభుత్వ తీరుపై ఆ పార్టీ సర్పంచ్‌ల్లోనే తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజంతో దేశాభివృద్ధి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆరోగ్యవంతమైన సమాజంతో దేశ అభివృద్ధి సాధ్యపడుతుందని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య పీవీజీడీ ప్రసాద్ రెడ్డి అన్నారు. గురువారం ఏయూ వైద్యశాలలో ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ఉద్యోగులు విద్యార్థులు తమ ఆరోగ్యాన్ని సంరక్షించుకునే విధంగా ఆలోచన చేయాలని సూచించారు. అనంతరం ఆయన స్వయంగా వివిధ ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో హెల్త్ డొమైన్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఏ. లీలారాణి, టి.రజిని కుమారి, టి.ప్రవీణ్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య వి విజయలక్ష్మి, పూర్వపాలక మండల్ సభ్యులు కృష్ణ మంజరి పవార్ దూర విద్యా సంచాలకులు కే విశ్వేశ్వరరావు, విద్యార్థులు, పరిశోధకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు జగనన్నకు చెబుదాం

విశాలాంధ్ర - హుకుంపేట: మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెంకటరావు, తహశీల్దార్ రాజలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల ప్రజలు, ప్రజా ప్రతినిధులు హాజరై జగనన్నకు చెబుదాంను వినియోగించుకోవాలని కోరారు. ఉదయం 10 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు.

జనసేనలో చేరిన 30 కుటుంబాలు

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: చెరుకుంపాలెం పంచాయితీ సంజీవనగరం గ్రామంలో 30 కుటుంబాలకు చెందిన వ్యక్తులు జనసేన పార్టీ సిద్ధాంతాలు నచ్చి పార్టీలో చేరినట్లు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు బోదిరెడ్డి త్రిమూర్తులు తెలిపారు. రంపచోడవరం డివిజన్ నాయకుడు కుర్ల రాజశేఖర్ రెడ్డి వారికి జనసేన పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. చెరుకుంపాలెం జనసేన పార్టీ పంచాయితీ ఇంచార్జిగా మడకం సత్యనారాయణ, సెక్రటరీగా కోటం ఆదినారాయణ, యూత్ ప్రెసిడెంట్‌గా ముర్కుర్తి కిరణ్ కుమార్‌లను నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన అధ్యక్షులు కొచ్చా లోకేష్, రాజవొమ్మంగి జనసేన పార్టీ మండల నాయకులు పోకల మల్లికాసులు, అడ్డతీగల మండల నాయకులు కుప్పల జయరాం, జడ్డంగి జనసేన నాయకులు వడుగుల శ్రీనివాస్ జర్త సాయి పాల్గొన్నారు.

రికార్డు ధర పలికిన గణపతి లడ్డూ

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి దుర్గ ఆదర్శనగర్ కాలనీలో గణపతి లడ్డూ వేలంలో రికార్డు ధర పలికింది. కాలనీ పెద్దల సమక్షంలో రెండు లడ్డుల్ని వేలం పాట వేయగా 5 కేజీల లడ్డుని కౌలూరి శ్రీనివాసరావు రూ.33500కు కైవసం చేసుకోగా, 10 కేజీల లడ్డూని బాదిరెడ్డి దేవుడు బాబు, లక్ష్మీ దంపతులు రూ.66000 వేలకు పాడుకుని రికార్డు నెలకొల్పారు.

కాగా క్రేజీ గైస్ వినాయక చవితి సంబరాలు 17 రోజులు పాటు వైభవంగా జరిగాయి. వేదపండితులు రాజేశ్ శర్మ అధ్వర్యంలో అనునిత్యం నిత్య విధాన కర్మలతో పూజా కార్యక్రమాలు ఆచరించి దీపారాధనలు కుంకుమార్చనలు హోమాలు, సర్వ అలంకారాలతో ఉత్సవాలు కనుల పండువుగా నిర్వహించారు. నిమజ్జనం రోజున 4000 మందికి అన్నసమారాధన నిర్వహించారు. గణపతిని ఎమ్మెల్యే అదీప్ రాజ్, టిడిపి కార్పొరేటర్ పీలా శ్రీను, బిజెపి రాము నాయుడు తదితర ప్రముఖులు దర్శించుకొని పూజలు చేసారు.

డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్‌కు ఘన నివాళులు

విశాలాంధ్ర - భీమిలి: భారత వ్యవసాయ శాస్త్రవేత్త, జన్యుశాస్త్ర నిపుణుడు పద్మ విభూషణ్ డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్‌కు ఏపీ మెకానైజెడ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఘన నివాళులు అర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వామినాథన్ ఫౌండేషన్ పేద వర్గాల వారికి సహాయం చేయటానికి అనునిత్యం కృషి చేస్తుందని భౌతికంగా ఎంఎస్ స్వామినాథన్ ప్రజలకు దూరమైనా భారతదేశంలో ప్రతి పౌరుని మనసులో చిరస్మరణీయ గుర్తింపు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు దూడపోలయ్య, గుంటు దానయ్య, సిఐఐ న్యూఢిల్లీ ప్రతినిధులు హర్షవర్ధన్ అమిత్, ఆఫ్ కాఫ్ హార్బర్ మేనేజర్ గోవిందరావు కాకి శ్రీనివాస్, బడే ఎల్లాజీ, గనగళ్ల పోతయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే సీఎం జగన్ లక్ష్యం

విశాలాంధ్ర - మాకవరపాలెం: రైతు శ్రేయస్సే ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. మండలంలోని కొండల అగ్రహారం గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులను అన్ని విధాలా ఆదుకు నేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రుత్తల సత్యనారా యణ, పార్టీ అధ్యక్షులు రుత్తల శ్రీనివాస్, నాయకులు రమణ, గోవిందరావు, భద్రాచలం, సర్పంచ్ పోలిరెడ్డి అచ్చియమ్మ, ఎంపిటిసి సుబ్బలక్ష్మీ, తహశీల్దార్ ప్రసాదరావు, ఎంపిడిఓ అరుణశ్రీ, వ్యవసాయాధికారి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

అన్న సమారాధన ప్రారంభించిన ముత్యాల సతీష్



విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: జీవీఎంసీ జోన్ 83వ వార్డు భీముని గుమ్మం జై భీమ్ యూత్ సంఘం వారి ఆధ్వర్యంలో గురువారం అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. యూత్ కమిటీ ఆహ్వానం మేరకు ప్రముఖ పారిశ్రామికవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు తనయుడు ముత్యాల సతీష్ పాల్గొని స్వామివారిని దర్శించుకొని అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి సేవా కార్యక్రమాలు చేస్తున్న జై భీమ్ యూత్ సంఘం వారిని సతీష్ అభినందించారు. జై భీమ్ యూత్ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని, అందుకు తమ వంతు ఆర్థిక సహాయం చేయటానికి తామెప్పుడూ ముందుంటామని ఆయన తెలియజేశారు. అనంతరం కమిటీ సభ్యులు ముత్యాల సతీష్‌కు దుస్సాలువా కప్పి, సన్మానించి చిరు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.వి.ఆర్ యూత్ సభ్యులు సంజు టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఆదాయ లక్ష్యం రూ.వెయ్యి కోట్లు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: బీఎస్ఎన్ఎల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆదాయం లక్ష్యం రూ.వెయ్యి కోట్లు అని ఆంధ్ర ప్రదేశ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.శేషాచలం అన్నారు. దాబాగార్డన్స్‌లో గల సంస్థ కార్యాలయంలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. దేశంలోనే పెద్ద ప్రభుత్వ రంగ సంస్థలలో ఇది ఒకటి అన్నారు. సంస్థ కేపిటల్ షేర్ 1.50 లక్షల కోట్లు అని తెలిపారు. ఫైబర్ నెట్, ఇంటర్ నెట్ సదుపాయాలు అందుబాటు ధరలకే అందిస్తున్నామన్నారు. సంస్థ టర్నోవర్ రూ. 19 వేల కోట్లలో ఏ పి సర్కిల్ లో ఆదాయం రూ. 700 కోట్లు వుందని, గత ఏడాది తో పోలిస్తే పది శాతం ఆదాయం పెరిగింది అన్నారు. ఏపీలో 4 జీ సేవలు 3800 గ్రామాలలో అందుబాటులోకి వస్తాయి అన్నారు. 2026 నాటికి సంస్థ లాభాల బాటలోకి వచ్చేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. మీడియా సమావేశంలో సంస్థ విశాఖ జిల్లా జనరల్ మేనేజర్లు పి.పాల్ విలియమ్స్, జీ.ఆడం, మొబైల్స్ విభాగం హెడ్ ఏ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీ తెలుగులో తెలుగు మీడియం ఐస్కూల్, జాబిల్లి కోసం ఆకాశమల్లే ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: జీ తెలుగులో ఇదివరకెన్నడూ లేని విధంగా సరికొత్త కాన్సెప్ట్ టెలివిజన్ రంగంలో విప్లవాత్మక మార్పుకు శ్రీకారం చుట్టబోతోందని ఆ ఛానెల్ ప్రతినిధి చెప్పారు. బాలీవుడ్ బ్యూటీ సన్నీ లియోన్ ముఖ్య అతిథిగా ప్రారంభం కానున్న తెలుగు మీడియం ఐస్కూల్ అక్టోబర్ 8 నుంచి ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకు, అదేవిధంగా జాబిల్లి కోసం ఆకాశమల్లె అక్టోబర్ 9 నుంచి సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు మధ్యాహ్నం 2 గంటలకు, జీ తెలుగులో పారంభం కానున్నదన్నారు. వీటి వల్ల రాజేశ్వరీ విలాస్ కాఫీ క్లబ్ మధ్యాహ్నం 12 గంటలకు, మావారు మాస్టారు. సాయంత్రం 4 గంటలకు ప్రసారమవుతాయని చెప్పారు.

రహదారులపై క్రమ విక్రయాలు జరపొద్దు

విశాలాంధ్ర - ఆనందపురం: రద్దీగా ఉండే మార్కెట్ వద్ద పువ్వులు అమ్మకందారులు రహదారిపై విక్రయాలు జరపకుండా ప్రజలు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని ఆనందపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.రామచంద్రరావు తెలిపారు.

గురువారం ఆనందపురం జంక్షన్‌లో పువ్వుల మార్కెట్, పండ్ల వర్తకులతో రోడ్డుపై పువ్వులు క్రయ విక్రయాలు జరపడం వల్ల రోడ్లపై నిత్యం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందని అన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిఐ రామచంద్రరావు, ఎస్ ఐ నరసింహమూర్తి, ట్రాఫిక్ ఎస్ఐ రఘురాం, ఆది తదితర పోలిస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకి సమగ్ర శిక్ష ఉద్యోగుల వినతి

విశాలాంధ్ర - నర్సీపట్నం: నర్సీపట్నం నియోజకవర్గంలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులు నర్సీ పట్నం నియోజకవర్గ శాసనసభ్యులు ఉమా శంకర్ గణేష్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యే దిశగా చూస్తానని హామీ ఇచ్చారు. మూడు నెలల జీతాల బకాయిలను ఎస్పీడితో మాట్లాడి పరిష్కారం అయ్యే విధంగా చూస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మండలం సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగుల అధ్యక్షుడు ఏ. వరహాల నాయుడు జనరల్ సెక్రటరీ ఎస్.రమేష్, పి వెంకట్రావు, నాయుడు, నూర్బి సాహెబ్, శ్రీను వాసరావు, పి. సతీష్, మరియు నర్సీపట్నం నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాల సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులు పాల్గొన్నారు.

బాలికల హాస్టల్ వసతులకు దివీస్ వితరణ

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ భీమిలిలోని వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహం ఆధునిక వసతుల కోసం రూ. 38,64,000 నిధులను దివీస్ సంస్థ వెచ్చించింది. భీమిలీలోని కృష్ణాజీ కాలనీ లోని హాస్టల్ లో జరిగిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. మల్లికార్జున మాట్లాడుతూ అన్ని దానాల కంటే విద్యాదానం గొప్పదానం అన్నారు. దివీస్ జీఎం వైఎస్ కె.రావు మాట్లాడుతూ విద్య పట్ల మక్కువతో, పేద విద్యార్థులకు ఆధునిక వసతులు కల్పిస్తున్నామన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి కె.శ్రీదేవి, వరహాలరెడ్డి, సురేష్ కుమార్, వసంత కుమార్, శ్రీతశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపాదన తీర్మానాలతోనే పంచాయతీ అభివృద్ధి

విశాలాంధ్ర - డుంబ్రిగుడ: పంచాయితీ అభివృద్ధికి పాలకవర్గ వార్డు సభ్యుల ప్రతిపాదన తీర్మానాలతోనే గిరిజన అభివృద్ధి సాధ్యపడుతుందని మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు, కంద్రుమ్ గ్రామ పంచాయతి సర్పంచ్ కిముడు హరి అభిప్రాయపడ్డారు. గురువారం పంచాయతీ కేంద్రంలోని గిరిజన అభివృద్ధికై పంచాయతీ వార్డు సభ్యులతో గ్రామ సభ నిర్వహించి మాట్లాడారు. పంచాయితీ పరిధిలో గల వివిధ గ్రామాల్లోని గిరిజనులకు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు గాను ముందస్తుగా తీర్మానాలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన చెప్పారు అందుకు పాలకవర్గ సభ్యులు అభివృద్ధి పనుల నిర్వహణకై ప్రతిపాదనలు పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు శెట్టి ఆనంద్, ఉపసర్పంచ్ కిముడు ప్రతిమ, పంచాయతీ కార్యదర్శి గొల్లోరి గోవింద్, వార్డు సభ్యులు, నీచర్ సంస్థ కోఆర్డినేటర్, గ్రామ వాలంటీర్లు, పోస్ట్ మెన్,ఆశా కార్య కర్త, అంగన్వాడీ కార్య కర్తలు,నాయకులు వినోద్ కుమార్ మండల కార్యదర్శి, తాంగుల గోపి పాంగి శత్రుగున్,పాంగి అప్పారావు, తాంగుల మాధవరావు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన డా. బొడ్డేడ

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ఇటీవల వైసీపీ వైద్య విభాగానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమతులైన డా. బొడ్డేడ లక్ష్మీ నరసింహరావు మంత్రి గుడివాడ అమర్నాథ్‌ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి పని చేయాలని, వై.యస్.జగన్మోహన్ రెడ్డిని మళ్ళీ అధికారంలోకి తీసుకు రావటానికి ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలని, ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు దగ్గరుండి ముఖ్యమంత్రి ఉద్దేశం ప్రజలలోకి తీసుకు వెళ్లాలని ఆదేశించారని తెలిపారు. వైయస్సార్సీపి గెలుపు కోసం కృషి చేస్తానని, అమర్ నాయకత్వాన్ని బలపరుస్తూ, ఒక సైన్యం లాగా నడుస్తామని , తనకు రాజకీయ బిక్ష పెట్టిన అమర్‌కి, అనకాపల్లి జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్‌కి జీవితాంతం రుణ పడి ఉంటానని తెలియజేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ దేవాలయ చైర్మన్ కే.యం నాయుడు, భోగ లింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు, కశింకోట యువ నాయకులు రఫీ హుస్సేన్, నాగులపల్లి యువ నాయకులు దుంగ నూకేష్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బొడ్డేడను సత్కరించిన చందు ఆర్మీ

రాష్ట్ర వైద్య విభాగానికి ప్రధాన కార్యదర్శిగా నియమితులైన డాక్టర్ బొడ్డేడ లక్ష్మీనరసింహారావుని కేకే డెవలపర్స్ అధినేత కాండ్రేగుల రామ చంద్రరావు, కేఎస్ డెవలపర్స్ అధినేత కాండ్రేగుల శ్రీరామ్, చందు యువసేన, మిత్రమండలి సభ్యులు గురువారం ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ డాక్టర్ లక్ష్మీనరసింహారావు ఒక వైద్యుడిగానే కాకుండా ప్రజాసేవకి అంకితమై ఉత్సాహంతో రాజకీయాల్లోకి రావడం ఒక శుభ పరిణామం అని పార్టీ బలోపేతానికి ఒక కీలకమైన నాయకుడిగా ఎదుగుతాడని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, కేఎస్ డెవలపర్స్ చైర్మన్ శ్రీరామ్, సురేష్, నాగరాజు, కాండ్రేగుల ప్రవీణ్ బొడ్డేడ కిరణ్, అరిపాక సాయి పెదపాటి శివ, మళ్ల వంశీ, బుద్ధ జగన్, దూలం గోపి, కాండ్రేగుల మోహన్, హుస్సేన్ రఫీ, దుంగ నూఖేష్, బొడ్డేడ లిల్లీ, చందు మిత్రమండలి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సభలకు డ్వాక్రా మహిళలను రమ్మనడం దుర్మార్గం

విశాలాంధ్ర - పరవాడ: ముత్యాలమ్మపాలెంలోని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సభకు డ్వాక్రా మహిళలకు తీసుకురమ్మని ఆధేశాలివ్వడం దుర్మార్గమని ఆగ్రామ టీడీపీ బూత్ ఇన్‌చార్జి చింతకాయల ముత్యాలరావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రత్రికా ప్రకటన విడుదల చేసారు. ప్రజల నుంచి స్పంధన కరువవడంతోనే ఎమ్మెల్యే సభకు డ్వాక్రా మహిళలను రమ్మని సీసీతో ఆదేశాలు ఇప్పించడం జరిగిందన్నారు. ఇది పూర్తిగా చట్ట విరుద్ధమన్నారు. ఒక పార్టీ మీటింగుకి డ్వాక్రా మహి ళలను తీసుకెళ్లడం మంచి పద్ధతికాదన్నారు. ముత్యా లమ్మపాలెం పంచాయతీ ప్రజలకు ఎమ్మెల్యే ఇచ్చిన హామీలు నెరవేర్చని కారణంగా ప్రజలు నుంచి స్పందన లేనందునే ఇలాంటి ఎత్తుగడలకు పాల్పడు తున్నారన్నారు. దీనిపై ఆయా శాఖాధికా రులను అడగ్గా అలాంటి ఆధేశాలు ఏమీ ఇవ్వలేదని చెప్పారన్నారు.

కానీ సీసీ మాత్రం పార్టీ కార్యకర్తలా వ్యవహరించి వైసీపీ నేతలకు మద్దతు పలకడంపై తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆదేశాలిచ్చిన అధికారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేసారు.

సంపూర్ణ ఆరోగ్యం కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర - భీమిలి: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే జగనన్న సురక్షలక్ష్యమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. భీమిలి నియోజకవర్గంలో పలు చోట్ల జగనన్న సురక్ష జరిగింది. ఈ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ద్వారా ప్రతీ ఇంటికి వెళ్ళి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని ఉచిత వైద్య పరీక్షలు చేసి వైద్య చికిత్సతో పాటు ఉచితంగా మందులు అందివ్వడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో బాగంగా ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాల్స్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్‌లు, వార్డు ఇన్‌చార్జిలు, ఎంపీపీ, జెడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ: ప్రజల ఆరోగ్యం పట్ల ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఎంపీపీ కూరచా జయమ్మ అన్నారు. మండలంలోని జైతవరం గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ అనారోగ్య సమయంలో పేదలు పడుతున్న ఇబ్బందులు గుర్తించి కార్పొరేట్ తరహా వైద్యం అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోదూరు సత్యవతి, వైకాపా మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబు, మండల సచివాలయ కన్వీనర్ ఈర్ల చైతన్య, ఎంపీడీవో జయప్రకాశరావు, ఈవోపీఆర్డి కామేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి గోపి, వీఆర్వో గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నందమూరి, నారా కుటుంబాలకు అవినీతి మచ్చ ఏనాడు లేదు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: నందమూరి, నారా కుటుంబాలకు దాదాపు 20 సంవత్సరాలు పాటు అధికారంలో ఉన్నప్పటికీ ఈ రెండు కుటుంబాలకు చెందినవారు ప్రభుత్వంలో జోక్యం చేసుకున్నారని గాని అవినీతికి పాల్పడినట్లు గాని ఇంతవరకు ఎవరు ఆరోపించలేదని ఇప్పుడు మొదటిసారిగా వగ ప్రతీకారంతో రగిలిపోతున్న జగన్ రెడ్డి ఏకంగా చంద్రబాబు, లోకేష్‌ను జైలుకు పంపి ఎన్నికలలో ఏకపక్షంగా ప్రభుత్వ నియంతృత్వ వెళ్లడానికి కుట్రలో భాగంగా చంద్రబాబును, లోకేష్ ను టార్గెట్ చేశారని అనకాపల్లి జిల్లా అధ్యక్షులు మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు వైసీపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. న్యాయవ్యవస్థ ఇప్పటికైనా ఈ కేసు లోతుల్లోకి వెళితే వాస్తవాలు తెలుస్తాయని, ప్రజలకు కూడా నిజాలు తెలియాలని సిఐడిపై రాష్ట్ర ప్రజలకు నమ్మకం పోయిందని,న్యాయ వ్యవస్థపై అంతో ఇంతో నమ్మకం ఉందని ఆ నమ్మకంతోటే చంద్రబాబునాయుడు నచ్చీలుడుగా బయటకు వస్తారని నాగ జగదీష్ అన్నారు.

స్కిల్ కేసులో సాంకేతికంగా కాకుండా కేసు ప్రభుత్వం ఫైల్స్‌ని మాయం చేసి సినిమా కటింగ్ లాగా అక్కడక్కడ ముక్కలు తీసుకున్నట్టుగా సిఐడి అధికారులు వాస్తవాలను ఇవ్వకుండా సాక్ష్యాలను సిఐడి కోర్టు అడిగినప్పటికీ తాస్సారం చేస్తూ ప్రభుత్వ న్యాయవాదులు కోర్టును తప్పు త్రోవ పట్టిస్తున్నారని అన్నారు. విలేకరుల సమావేశంలో మాదంశెట్టి నీలబాబు, కుప్పిలి జగన్, మారిశెట్టి శంకర్రావు, కర్రి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కుల గణనకు బీహార్ దిక్సూచి కావాలి

ఏపీ స్టేట్ కాంగ్రెస్ ఓబీసీ విభాగం చైర్మెన్ మూల వెంకటరావు



విశాలాంధ్ర - పెందుర్తి: కులగణనకు దేశానికి బీహార్ దిక్సూచి కావాలని ఏపీ స్టేట్ కాంగ్రెస్ ఓబీసీ విభాగం ఛైర్మన్ మూల వెంకటరావు అన్నారు. విశాఖలో ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ సంక్షేమం, సామాజిక న్యాయం అందించడం, అభివృద్ధి సాధించడం ప్రభుత్వాల బాధ్యత అని, ఆ బాధ్యతను నిర్వహించాలంటే వాస్తవ పరిస్థితులపై సంపూర్ణ అధీకృత సమాచారం కావాలని అన్నారు. దేశ జనాభాలో ఓబీసీల శాతం అత్యధికమన్నది అందరూ ఎప్పటినుంచో అంగీకరిస్తున్న సత్యమన్నారు. బీహార్ గణాంకాలు ఈ సంగతినే ధృవీకరించాయని, దేశంలో ఆర్థిక సంస్కరణలు అమలు చేసిన పర్యవసానంగా దేశవ్యాప్తంగా కులవృత్తులు తీవ్ర సంక్షోభంలో పడి నిరసనలు వెల్లువెత్తాక అట్టడుగు వర్గాల సంక్షేమానికి ప్రభుత్వాలు కొత్త విధానాలు రూపొందించాయని పేర్కొన్నారు. ఓబీసీ హక్కుల కోసం మాట్లాడే పార్టీలు ఎటూ కొత్త ఆలోచనలు చేయక తప్పదన్నారు. స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు గడిచాక కూడా అత్యంత వెనుకబడిన కులాలు ఉన్నాయంటే అది మన పాలన వ్యవస్థలో లోపాన్ని పట్టి చూపిస్తుందన్నారు. మా నాయకులు రాహుల్గాంధీ, మల్లిఖార్జున్ ఖర్గే, గిడుగు రుద్రరాజులు జనగణనతో పాటు కులగణన జరగాలని ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నారని స్పష్టం చేసారు.

ఎఫ్ఈ పర్యావరణ వ్యవస్థను విస్తరించిన సాంసంగ్

విశాలాంధ్ర - విశాఖ సిటీ : భారతదేశంలో అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ కంపెనీ సాంసంగ్ గెలాక్సీ పర్యావరణ వ్యవస్థకు తాజా ఎఫ్ ఈ సిరీస్ చేరికలను ఈ రోజు ప్రకటించింది. ఐతిహాసిక గెలాక్సీ ఎస్ 23 ఎఫ్ ఈ మాత్రమే కాకుండా, గెలాక్సీ ట్యాబ్ ఎస్ 9 ఎఫ్ ఈ, గాలక్సీ ట్యాబ్ ఎస్ 9 ఎఫ్ ఈ ప్లస్, గెలాక్సీ బడ్స్ ఎఫ్ ఈ వినియోగదారులకు ప్రీమియం అనుభవాన్ని అందించడానికి ఎఫ్ ఈ పర్యావరణ వ్యవస్థలో చేరాయి. తమ దిగ్గజ మరియు మన్నికైన డిజైన్‌లు, ఆధునిక పనితీరు, లీనమయ్యే వీక్షణ అనుభవం మరియు ఆడియో సామర్థ్యాలకు ప్రసిద్ధి చెందిన ఇవి ఇప్పటికీ యువ తరానికి అత్యంత అద్భుతమైన ఎఫ్ ఈ డివైజ్ లు నిలుస్తాయని సంస్థ ప్రతినిధి చెప్పారు. అవసరమైన వినోదం, వ్యక్తీకరించబడే సృజనాత్మకత మరియు నిరంతరంగా సామర్థ్యాన్ని అందించడానికి ఫీచర్స్ తో నిండిన డివైజ్ లు. ఎంచుకోవడానికి రెండు పొందికైన మరియు శక్తివంతమైన డివైజ్‌లు అన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన పైలా ప్రసాదరావు

విశాలాంధ్ర - కె.కోటపాడు: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ని మాడుగుల నియోజకవర్గం టిడిపి నాయకులు పైలా ప్రసాదరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు బండారు అప్పలనాయుడు, కోట్ని బాలాజీ ఢిల్లీలో కలిసి సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం మోపిన అక్రమ కేసుల నుంచి త్వరలోనే నారా చంద్రబాబు నాయుడు బయటకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. బండారు సత్యనారాయణ మూర్తి అరెస్టు సందర్భంగా ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితులు, పోలీసులు వ్యవహరించిన తీరు వంటి విషయాలను వివరించారు. అధినేత చంద్రబాబుపై కక్షపూరితంగా కేసులు పెట్టి వేధిస్తున్న తీరు పట్ల వైకాపా ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్న పరిస్థితులు, చంద్రబాబుకి మద్దతుగా సాగుతున్న నిరాహార దీక్షలు, ఉద్యమాల గురించి చర్చించారు.

పది విద్యార్థులకు నేడు రాత పరీక్ష

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు ఈనెల 6వ తేదీన రాత పరీక్ష నిర్వహిస్తున్నామని ఐటీడీఏ పీఓ వి.అభిషేక్ తెలిపారు. రాత పరీక్ష స్థానిక లోచలిపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలురు పాఠశాల-1లో 180 మంది బాలురకు, శ్రీకృష్ణా పురం గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో 140 మంది బాలికలకు రాత పరీక్ష నిర్వహిస్తామన్నారు. రాత పరీక్ష మధ్యాహ్నం మూడు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతుందన్నారు. రాత పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పదవ తరగతిలో 10/10 మార్కులు సాధించే విధంగా ప్రత్యేక శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు.

గుండెపోటుతో చంద్రబాబు అభిమాని మృతి

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండలం జడ్డంగి గ్రామస్తులు రాజవొమ్మంగి సొసైటీ మాజీ అధ్యక్షుడు కీ.శే.గురుజు మల్లిఖార్జునరావు(కాసులు) సతీమణి గురుజు భూలక్ష్మి బ్రెయిన్ స్ట్రోక్‌తో గురువారం కాకినాడ జిజిహెచ్‌లో మరణించింది. ఈమె చంద్రబాబు అభిమాని, అప్పటివరకూ కుటుంబ సభ్యులతో గడిపిన భూలాక్ష్మి చంద్రబాబుకు సంబందించిన వార్తలు చూస్తూ హఠాత్తుగా బి.పి.పెరగడంతో ఆసుపత్రికి తీసుకువెళ్లగా బ్రెయిన్ స్ట్రోక్‌గా వైద్యులు నిర్ధారించి వైద్యం అందించినప్పటికి ఫలితం లేకపోయిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

నీటి సమస్య పరిష్కారం కోసం బోరు నిర్మాణం

విశాలాంధ్ర - చింతపల్లి: నీటి సమస్య పరిష్కారం కోసం బోరు నిర్మాణం చేపడుతున్నట్లు లమ్మసింగి పంచాయతీ సర్పంచ్ శాంతి కుమారి అన్నారు. అరకు పార్లమెంటు సభ్యురాలు గొడ్డేటి మాధవి ప్రత్యేక నిధులు కేటాయించడంతో గిరి గ్రామాలలో బోర్ల నిర్మాణం చేపడుతున్న క్రమంలో లంబసింగి పంచాయతీలోని చీకటిమామిడి గ్రామంలో గురువారం బోరు నిర్మాణానికి స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు నాగమణి, మాజీ సర్పంచ్ రఘునాథ్‌లతో ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో సమస్యలు లేని గ్రామాలే లక్ష్యంగా పాడేరు శాసనసభ్యులు భాగ్యలక్ష్మి, అరకు ఎంపీ మాధవి లు ప్రత్యేక చొరవ కనబరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రావుల నూకరాజు, నాగరాజు, గోపాల్, వార్డు మెంబర్లు విజయం, జానకి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రశ్నించే వారిపై అక్రమ కేసులా...!

విశాలాంధ్ర - చింతపల్లి: ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టి ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడమే వైకాపా ప్రభుత్వ నైజమని తెదేపా చింతపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనంద్, మహిళా నాయకురాలు నంబారి సత్యవతిలు అన్నారు. నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ గడచిన 26 రోజులుగా కొనసాగుతున్న నిరసన కార్యక్రమాలలో భాగంగా ఆనంద్ ఆధ్వర్యంలో చింతపల్లిలోను, సత్యవతి ఆధ్వర్యంలో లోతుగెడ్డ జంక్షన్ గ్రామంలోనూ బాబుతో నేను అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాబుతో నేను అనే కరపత్రాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాలలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న పోలరాజు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జీవీఎంసీ శ్మశాన వాటిక ఇన్‌చార్జి పోలరాజు మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ 70 ఏళ్ల వృద్ధుడు మృతి చెందడంతో ఆయనకు కుటుంబసభ్యులు ఎవరు లేకపోవడంతో మమత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు అనిమి రెడ్డి, రమణతో కలసి పోలరాజు గురువారం వృద్ధుని మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. కరోనా సమయంలో తన ప్రాణాలకు తెగించి పోలరాజు ఎన్నో మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన సేవ స్ఫూర్తిని ప్రజలు అభినందిస్తున్నారు.

శతాదిక వృద్ధురాలు మృతి



విశాలాంధ్ర - జీకే వీధి: శతాధిక వృద్ధురాలు గబులంగి లింగాలమ్మ (110) అకాల మరణం బాధాకరమైన విషయమైనప్పటికీ లింగాలమ్మ స్వగ్రామం గూడెం కొత్తవీధి మండలం పెదవలస పంచాయతీ పరిధిలోని దోకులూరు గ్రామంలో లింగాలమ్మ విగ్రహ ఏర్పాటుకు దాతలు ముందుకు రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఆనాడు విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అనుచరుడు అగ్గిరాజుకి మేనకోడలైన లింగాలమ్మ ఆనాటి మంప పితూరి సమయంలో అల్లూరి సీతారామరాజు అనుచరులు డోకులూరు గ్రామానికి వచ్చిన ఉద్యమకారులు అందరికీ అన్నం పెట్టి ఆదరించిన మహాత్మురాలు. శతాధిక వృద్ధురాలుగా ఉన్న ఆమె మరణించడం విచారకరం. ఆమె జ్ఞాపకార్ధకంగా, అల్లూరి సీతారామరాజును ప్రత్యక్షంగా చూసిన మహానుభావురాలైన విగ్రహాన్ని డొకులూరు గ్రామంలో ఏర్పాటు చేస్తే ఆ ప్రాంతంలో అల్లూరి సీతారామరాజు నడియాడిన నేటి సమాజంలోని యువతి, యువకులకు తెలిసే విధంగా ఉంటుందని పలువురు అంటున్నారు.

విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

శాస్త్రీయ ప్రగతి ప్రపంచ గతిని మార్చేస్తోంది

– రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్

విశాలాంధ్ర – విశాఖ కలెక్టరేట్: శాస్త్ర, సాంకేతక ప్రగతి ప్రపంచ గతిని మార్చేసిందని రాష్ట్ర ఐటి,పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు-2023లో భాగంగా షార్-ఇస్రో, రఘు విద్యాసంస్థలు రఘు ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను గురువారం మంత్రి అమర్నాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ ఇస్రో-షార్ దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నాయన్నారు. చంద్రయాన్ విజయవంతం కావడంతో ప్రపంచ దేశాలన్నీ భారతదేశం వైపు చూస్తున్నాయని అన్నారు. అతరిక్ష రంగంలో భారత్ ప్రస్థానం ఎంతో ఉన్నతంగా జరుగుతోందన్నారు. రానున్న దశాబ్దకాలంలో భారత దేశం స్పేస్ ఎకానమీ 10 శాతానికి చేరుకోవాలని మంత్రి అమర్నాథ్ ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఎస్‌డిఎస్‌సి-షార్, ఇస్రో డిప్యూటి డైరెక్టర్ జి.రమేష్ బాబు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు అంతరిక్ష పరిశోధనలపై ఆధారపడి ఉంటుందనే వాస్తవాన్ని అందరూ తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రఘు కళాశాల చైర్మన్ కలిదిండి రఘు, విశాఖ రీజియన్ సబ్ కమిటీ చైర్మన్ జి.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన జెర్రిపోతుల రమణాజి

విశాలాంధ్ర – చోడవరం : చోడవరం ఉషోదయ విద్యా సంస్థల చైర్మన్, డైరెక్టర్, ప్రముఖ విద్యావేత్త జెర్రిపోతుల రమణాజి జనసేనలో చేరినట్లు గురువారం ఆయన ఛాంబర్ లో జరిపిన విలేఖరుల సమావేశంలో తెలియజేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే నాయకుడిగా ఎదిగిన తాను జనసేన అధినేత పవన్ కళ్యాణ్ లో జవాబుదారీతనం, జీరో బడ్జెట్ పాలిటిక్స్, రాజకీయాల్లో నైతిక విలువలు ... తాను రాజకీయాల్లో చేరేందుకు ప్రభావితం చేశాయని అన్నారు. కశింకోట మండలం ఏ.ఎస్.పురానికి చెందిన తాను రెండవ తరగతి నుండే నాయకుడిగా ఎదిగి, తాళ్లపాలెం హై స్కూల్, అనకాపల్లి ఏ.ఎం.ఏ.ఎల్. కాలేజీ, ఆంధ్రా యూనిర్శిటీల్లో విద్యార్థి నాయకుడిగా పనిచేసినట్లు తెలిపారు. అదే స్ఫూర్తి తో ప్రస్తుతం చోడవరం ప్రైవేట్ పి.జి.,బి.ఎడ్ కళాశాలలు, మాడుగుల,. యలమంచిలి తదితర ప్రాంతాల్లో విద్యా సంస్థలు నెలకొల్పి, ప్రస్తుతం రాష్ట్ర ప్రైవేట్ విద్యాసంస్థలు సంఘానికి కార్యదర్శి గా పని చేస్తున్నట్లు తెలియజేశారు. సుమారు 70 శాతానికి పైగా వ్యవసాయమే జీవనాధారమైనవారు వున్నటువంటి ఉత్తరాంధ్ర తో బాటు విశాఖను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు జనసేన తరపున ప్రజా సేవ చేసేందుకు మాత్రమే తన మూడవ ప్రస్థానం జనసేన తో ఆరంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ విద్యా సంస్థల చైర్మన్ కృష్ణవేణి, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖ సెంటీనియల్ సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర – రావికమతం: మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖ సెంటీనియల్ వారు వితరణగా అందించిన దివ్యాంగులకు బోధనోపకరణ సామాగ్రితో పాటు 34 మంది విద్యార్థులకు 8వ తరగతి ఎన్.ఎం.ఎం.ఎస్ స్టడీ మెటీరియల్, 14 మంది విద్యార్థులకు 5వ తరగతి జవహర్ నవోదయ స్టడీ మెటీరియల్, పదిమంది పదో తరగతి విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ పుస్తకాలును (20వేల రూపాయలు విలువ గల) రావికమతం మండల విద్యాశాఖ అధికారులు సి.హెచ్ తలుపులు మరియు ఎన్. బ్రహ్మాజీ, మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వంకాయల రామారావు చేతులమీదుగా విద్యార్థులకు అందించడం జరిగింది. మండల విద్యాశాఖాధికారి సి.హెచ్ తలుపులు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖ సెంటీనియల్ వారి సేవలు ప్రశంసనీయమని అన్నారు. మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మి నాయుడు ప్రత్యేక చొరవ తీసుకొని రోటరీ క్లబ్ ఆఫ్ సెంటినియల్ ప్రెసిడెంట్ కె.వి.వి.ఎస్ మూర్తి గారితో మాట్లాడి పిల్లలకు స్టడీ మెటీరియల్ తో పాటు దివ్యాంగ విద్యార్థులకు బోధనోపకరణ సామాగ్రిని అందించడం జరిగిందని అన్నారు. గతంలో ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మి నాయుడు విజ్ఞప్తి మేరకు ప్రత్యేక అవసరాలు గల పిల్లల ఇంటర్నేషనల్ యోగ డే రాష్ట్ర కార్యక్రమానికి మరియు అనకాపల్లి జిల్లా దివ్యాంగుల క్రీడా పోటీలకు, అలాగే నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు దివ్యాంగ విద్యార్థులకు టీ షర్ట్ లు, భోజన సదుపాయం, సర్టిఫికెట్స్ ,మెమొంటోలు రూపేణా సహాయం అందించడం జరిగిందని అన్నారు. ప్రధానోపాధ్యాయులు వి రామారావు మాట్లాడుతూ ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మి నాయుడు దివ్యాంగ విద్యార్థులకు అన్ని రకాల సేవలు మరియు సదుపాయాలు అందించడంతోపాటు దాతలు నుండి కూడా పిల్లలకి అవసరమయ్యే పరికరాలను సమకూర్చడం జరుగుతుంది అని అన్నారు. అలాగే మేడివాడ పాఠశాల విద్యార్థులతో పాటు టి.అర్జాపురం హైస్కూల్ విద్యార్థులకు, చుక్కపల్లి మరియు దిబ్బిడి ఉన్నత పాఠశాల విద్యార్థులకు కూడా స్టడీ మెటీరియల్ ను ఉచితంగా అందించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, సిఆర్పి రామారావు పాఠశాల సిబ్బంది నాగేశ్వరరావు బాలరాజు ఎర్రయ్య రమణాజీ, దివ్యాంగ పిల్లలు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను వినియోగించుకోండి

విశాలాంధ్ర – దుంబ్రిగూడ: మండలంలోని కొల్లాపూటు పంచాయితీ వై కొల్లాపూటు గ్రామంలో గురువారం స్థానిక సర్పంచ్ పి.రామ్మూర్తి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో శ్రద్ధ వహిస్తున్నారని ఆయన అన్నారు. ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి ఆలోచన ఏ ముఖ్యమంత్రి చేయలేదని పేర్కొన్నారు. గ్రామ గ్రామాన వైద్యులు తిరిగి ప్రజలకు వైద్యం అందించడం ఎంతో సంతోష దాయకమన్నారు. గ్రామ వాలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి సర్వే చేసి అనరోగ్యానికి భారీనపడిన రోగులకు వారి జాబితాను సేకరించి ఆ జాబితా ఆధారంగా ఈరోజు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వైద్య సిబ్బంది గ్రామంలో రోగులకు ఉచితంగా వైద్య చికిత్స అందించడం జరిగిందని తెలిపారు. పంచాయితీలో ఉన్న గ్రామాలకు దశాల వారిగా సందర్శించి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామని వైద్య సిబ్బంది చెప్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు ఎస్.రాజు, జి. జగబంధు, బి. సుందర్, సచివాలయం సెక్రటరీ రాజ్ కుమార్, ఏఎన్ఎం రూప, కుమారి, ఆశ వర్కర్లు శెట్టి.ముక్త, ఎస్ లక్ష్మి, సిహెచ్.కుమారి, గృహసారథులు కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

వి. ఆర్. పురం: అల్లూరి సీతారామరాజు జిల్లా మండల లోని వడ్డి గూడెం గ్రామ సచివాలయం పరిధిలో మండల కేంద్రం జడ్పీఎస్ పాఠశాల నందు గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం స్థానిక సర్పంచ్ సోడే ఆధ్వర్యంలో నిర్వహించారు. రేఖపల్లి ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ ధనలక్ష్మి సమక్షంలో ఆర్థోపెడిక్ డాక్టర్ వంశీ, గైనకాలజిస్ట్ డాక్టర్ సత్యవతి రోగులకు పరీక్షలు నిర్వహించారు . ఈ సందర్భంగా స్థానిక ఎంపీటీసీ ముత్యాల భవాని మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ముఖ్య ఉద్దేశం ప్రతి పేదవానికి మెరుగైన వైద్యం అందించి ఆరోగ్య సురక్ష ద్వారా ఉచితంగా మందులు ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ఎన్ శ్రీధర్, ఎంపీడీవో ఫణీంద్ర కుమార్, జడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, వైఎస్ఆర్సిపి మండల నాయకులు మాదిరెడ్డి సత్తిబాబు, మండల జెసిఎస్ బొడ్డు సత్యనారాయణ, ఎంపీటీసీ బంధం విజయలక్ష్మి సచివాలయ సెక్రెటరీ వి . ఎస్ . రెడ్డి సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరో గ్య సురక్ష పథకంతో పేదవాడికి మే లు జరుగుతుందని అరుకు ఎమ్మె ల్యే చెట్టి పాల్గుణ అన్నారు. గురువారం మండలంలోని సూకురు పంచా యితీ కేంద్రంలో నిర్వహించిన జగ నన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని, గిరిజనుల ఆరోగ్య సమస్యలపై ఆరా తీశారు. గిరిజను లకు అందిస్తున్న వైద్య సేవలపై వైద్యాధికారులకు అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల సమస్యలు తెలుసుకున్న సిఎం గ్రామల వద్దే ఆరోగ్య సమస్యలు తీర్చాలన్న లక్ష్యంతో ఈ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేసిందన్నారు. ఈ అవకాశాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ వైద్య శిబిరంలో 520 మందికి వైద్య సేవలు అందించినట్లు స్థానిక వైద్యాధికారి డాక్టర్ శివమణి సాయి తెలిపారు. ఈ కార్యక్రమంలో జేడ్పీటీసీ రేగం మత్యలింగం, ఎంపీపీ కూడా రాజబాబు, జేసీయస్ మండల ఇంచార్జీ కె.రామకృష్ణా. ఎంపీడీవో వెంకటరావు, ఐసిడిఎస్ సీడీపీవో బాలచంద్రమణిదేవి, ఉపాధి హామీ పథకం ఏపివో లింగమూర్తి, ఈవోపీఆర్డీ అశోక్ కుమార్, స్థానిక సర్పంచ్ ధనసాని సత్యవతి,ఎంపిటీసీ కిలగడ సింహాచలం, వైసిపి నాయకులు మురళి, సచివాలయ సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది ,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

విశాలాంధ్ర – పద్మనాభం: విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గం పద్మనాభ మండలంలో సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. పద్మనాభంలో ఉన్న శ్రీ కన్యకా పరమేశ్వరి కోవెల్లో పద్మనాభం మండల గ్రామీణ వైద్యులకు జనరల్ వ్యాధులు గురించి వస్తున్న వైరల్ ఫీవర్స్ గురించి, నరాల వ్యాధులు గురించి, ఎముకల వ్యాధుల గురించి వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. విశాఖపట్నం లో కలెక్టర్ ఆఫీస్ దగ్గర ఉన్న ఆంధ్ర హాస్పిటల్ డాక్టర్స్ బృందం పాల్గొని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ .కే .సందీప్ కుమార్, ఆర్థోపెడిక్ డాక్టర్ .బి. శ్రీరంగ గుప్తా, జనరల్ మెడిసిన్, డాక్టర్ .జె. అవినాష్, న్యూరో ఫిజీషియన్, వారి వైద్య బృందం మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న టిడిపి రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర – వి.మాడుగుల: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టుకు నిరసనగా మాడుగుల నియోజకవర్గ టిడిపిఇన్‌చార్జ్ పివిజి.కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 23వ రోజుకు గురువారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా సైకో పోవాలి సైకిల్ రావాలంటూ నినాదాలు చేస్తూ చంద్రబాబు విడుదల అయ్యేవరకు ఈ పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అద్దెపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు, నందారపు సన్యాసిరావు, వడ్డాది రంజిత్ వర్మ, అప్పాన వెంకటరమణ, మిండి వరాహమూర్తి, గెల్లెడ్డి రామానాయుడు, రొంగలి అప్పలనాయుడు, రాళ్లపల్లి శ్రీరామ్మూర్తి, కసిరెడ్డి గణపతి, పేరపు అప్పలనాయుడు, ఎస్.నాయుడు, వి.రాజు పాల్గొన్నారు.

12 లక్షలు వడ్డీ రాయితీ అందజేత

విశాలాంధ్ర – వి.మాడుగుల: మాడుగుల సహకార సంఘానికి మూడు శాతం వడ్డీ రాయితీ కింద 12 లక్షల రూపాయలు మంజూరయ్యాయి. ఆ మొత్తాన్ని గురువారం సంఘంలో జరిగిన సమావేశంలో 482 రైతులకు నగదు రూపంలో సంఘ అధ్యక్షుడు పెరుమాళ్ల వెంకటరావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెదబాబు, సర్పంచ్ యద్ల కళావతి, ఉప సర్పంచ్ శ్రీనాధు శ్రీనివాసరావు, వైసిపి పట్టణ అధ్యక్షులు బమ్మిశెట్టి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ సూర్యరావు, ఆర్‌బికె చైర్మన్ శ్రీధర్ పాల్గొన్నారు.

తూటిపాలలో పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం

విశాలాంధ్ర – మాకవరపాలెం: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని మాకవరపాలెం మండలం తూటిపాల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులంతా ఉపాధ్యాయులను సత్కరించారు. అనంతరం విద్యార్థులకు చక్కని విద్యాబుద్దులతో పాటు డ్రాయింగ్, క్రాస్ట్, నీతి పద్యాలలో ఉత్తమ బోధన చేస్తున్న ఉపాధ్యాయురాలు సంతోషిని, హెచ్ఎం, ఇతర ఉపాధ్యాయులు సత్కరించారు.

అందుబాటులో లేని వైద్యులు

విశాలాంధ్ర – చోడవరం: ఆపద సమయాలు, రాత్రి వేళల్లో చోడవరం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు అందుబాటులో ఉండడం లేదని ఇక్కడకు వచ్చే రోగులు, వారి బంధువులు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లో డ్యూటీ డాక్టర్స్ దుమ్మా కొట్టడంతో చుట్టుపక్కల సుమారు 40 గ్రామాల నుండి నిత్యం వచ్చెడి రోగులు ఆపద సమయంలోను, రాత్రి వేళల్లో నరక యాతన పడుతున్నామని చెబుతున్నారు. రాత్రి, పగలు డ్యూటీ డాక్టర్స్ ప్రభుత్వ విధులకు దుమ్మా కొడుతూ తమ ప్రైవేట్ క్లినిక్స్ లో 24 గంటలూ వైద్య సేవలు చేస్తున్నట్టుగా కొంతమంది రోగులు, స్థానిక ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. దీనిపై ఇక్కడి వైద్య సిబ్బంది ఉన్నతాధికారులను తమ లావాదేవాల్లో వాటాలు పంచుతూ "తిలా పాపం, తలో పిడికెడు" అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజా, మహిళా సంఘాలు వారు చెబుతున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి ప్రజా వైద్య సేవలు అన్ని వేళల్లో అందుబాటులోకి తీసుకు రావాలని ప్రజా, మహిళా విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

రెవెన్యూ సర్వేతో గిరిజనేతరుల్లో గుబులు

విశాలాంధ్ర – హుకుంపేట : మండల కేంద్రంలో రెవెన్యూ అధికారులు గురువారం రోడ్డు విస్తరణ కోసం సర్వే ప్రారంభించడంతో గిరిజనేతరుల్లో గుబులు మొదలైంది. ఇప్పటికే మండలంలో గిరిజనేతరులు 1/70 చట్టానికి వ్యతిరేకంగా అక్రమ నిర్మా ణాలపై, రెవెన్యూ అధికారులు నోటీసులు ఇవ్వడానికి వెళ్లగా వాళ్లపై కొంతమంది ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. గిరిజనులకు కవచంగా ఉన్న 1/70 చట్టం అసలు అమలు జరగటంలేదు. అక్రమ నిర్మాణాలు చేపట్టిన గిరిజనేతరులకు ఇబ్బందు లు తప్పవని స్థానిక ఆదివాసులు, ప్రజా ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థలు చెబుతున్నారు. దీంతో గిరిజన నేతలు కట్టిన భవనాలు మండల కేంద్రం రోడ్డు వెడల్పు సర్వేలో పోతాయని, గుంపులు, గుంపులుగా గుసగుసలావడం, రెవెన్యూ అధికారుల దగ్గర కలవడం, అధికారులు వీటిపై తిరస్కరించడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఇక ముమ్ముందు ఏం జరుగుతుందో వేచి చూడవలసి ఉంది.

అవకాశం ఇస్తే పోటీ చేస్తా: డాక్టర్ బంగారయ్య

విశాలాంధ్ర – పాయకరావుపేట: రాబోయే ఎన్నికల్లో పాయకరావుపేట అసెంబ్లీ టిక్కెట్టు ఇస్తే పోటీ చేసేందుకు సిద్దంగా ఉన్నానని వైసీపీ నాయకులు డాక్టర్ బంగారయ్య తెలిపారు. ఈమేరకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ఢిల్లీలో కలిసి తనకు చెందిన వివరాలు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పాయకరావుపేట నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ తరుపున పోటీ చేసి బంగారయ్య ఓటమి పాలయ్యారు. గతంలో కెజిహెచ్‌లో ఆర్ఎంఓగా పనిచేసిన బంగారయ్య నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గత 10ఏళ్లుగా పలు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వేలాది మందికి వైద్య సేవలు అందించినట్లు ముఖ్యమంత్రికి తెలిపారు.

మృతి చెందిన పశువులకు సంబంధించి నష్టపరిహారం చెల్లించండి

సీపీఐ పార్టీ మండల కార్యదర్శి సత్తిబాబు

విశాలాంధ్ర – జీకే వీధి :- అతివేగంగా టిప్పర్ వాహనాన్ని నడిపి తొమ్మిది ఆవులు ఏడు మేకల మృతికి కారణమైన డ్రైవర్ ను కఠినంగా శిక్షించడమే గాక మృతి చెందిన పశువులకు సంబంధించి గిరిజనులకు నష్టపరిహారం చెల్లించాలని, అదే క్రమంలో గాయపడిన మూగజీవాలకు పూర్తిస్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని సిపిఐ మండల కార్యదర్శి కంకిపాటి సత్తిబాబు అన్నారు. మన్యంలో రహదారుల నిర్మాణానికి సంబంధించి మెటీరియల్ తీసుకువెళ్లే టిప్పర్లు అతివేగంగా ప్రయాణిస్తూ మూగజీవాల మృతికి కారణం కావడం విషాదకరమన్నారు. పశువులు మేకలపైనే ఆధారపడి జీవించే గిరిజనులు వాటి మృతితో దిక్కులేని వారయ్యారన్నారు. వారికి సకాలంలో నష్టపరిహారం చెల్లించాలని గాయపడిన మూగజీవాలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అదే క్రమంలో మన్య ప్రాంతంలో భారీ వాహనాలు అతివేగాన్ని నియంత్రించాలని ఆయన డిమాండ్ చేశారు.

నేడు టీడీపీ దీక్ష

విశాలాంధ్ర – అనంతగిరి: అనంతగిరి మండలంలోని కాశీపట్నం పంచాయతీ కేంద్రంలో శుక్రవారం ఉదయం తెదేపా దీక్ష నిర్వహిస్తున్నట్లు తెదేపా మండల అధ్యక్షులు బుజ్జిబాబు తెలిపారు. మాజీ మంత్రి కిడారి శ్రావణ కుమార్,అబ్రహం, దొన్నుదొర తదితరులు తెదేపా దీక్ష శిబిరానికి వస్తున్నారని చంద్రబాబు అక్రమ అరెస్టు ను నిరశిస్తూ చేపడుతున్న దీక్షలో బాగంగా కాశీపట్నం పంచాయతీ కేంద్రంలో తెదేపా కుంటుంబ సభ్యులతో కలిసి దీక్ష చేస్తున్నమని తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

విశాలాంధ్ర – ఆనందపురం: ఆనందపురం మండలం వేములవలస మార్కెట్ వద్ద బీసీ కాలనీలో బూర్లి లక్ష్మణ (30) మేడ మీద టెంట్ హౌస్‌లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ప్రకారం గురువారం ఉదయం 8:45 నిమిషాలు సమయంలో వాళ్ళ అమ్మ సరస్వతి వాళ్ల అబ్బాయి ఎంతసేపటికి కూడా క్రిందకి రాకపోవడంతో అనుమానం వచ్చి వాళ్ళ అమ్మ పైకి వెళ్లి చూడగా టెంట్ హౌస్ లో చీరతో ఉరిపోసుకొని చనిపోయి ఉన్నాడు. 8 సంవత్సరాల క్రితం బీటెక్ పూర్తి చేసి ఐటి ఉద్యోగం చేసి కరోనా కారణంగా ఉద్యోగం కోల్పోయి ఇంటి వద్దనే చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. స్థానికులు సమాచారం మేరకు ఉద్యోగం లేక మనస్థాపంతో ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని తెలిపారు. మృతుడుకు ఒక సోదరి, సోదరుడు ఉన్నారు. తండ్రి జగదీశ్వర్ రావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్యాంసుందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూరాకులమడి కథల పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర – విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వ విద్యాలయంలో వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.వి.డి.ప్రసాద్ రెడ్డి అయ్యగారి సీతారత్నం తెలుగు ప్రొఫెసర్ రచించిన కూరాకులమడి అనే కథల పుస్తకం ఆవిష్కరించారు. ఈ సభలో ఆచార్య కృష్ణమోహన్, రెక్టార్ ఆచార్య సమత పాల్గొన్నారు. కూరాకులమడి కథలు వైవిధ్యపూరితమైన, సమకాలీనకౌటింబిక, సాంఘిక సమస్యల పట్ల అవగాహనతో ఆసక్తికరంగా విజ్ఞాన దాయకంగా రాసిన కథలసంపుటిగా ఆచార్య జి.వి.జి డిప్రసాదరెడ్డి పేర్కొన్నారు. ఆచార్యకృష్ణమోహన్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర మహిళల సమస్యలు, సాఫ్ట్ వేర్ వారి జీవితాలకి సంబంధించినవి, నేటి సామాజిక జనజీవితం చిత్రీకరణ, ఉత్తరాంధ్రమాండలికం, ఉత్తరాంధ్ర జనజీవితం ఈ కథలలో తెలుస్తాయని తెలిపారు. ఈసభలో ఆచార్యులు డా.పుల్లారావు, డా.శ్రీనివాస్, డా.మధుసూదన్ డా.త్యాగరాజ, డా.ఋూసి వెంకటస్వామి, డా.విజయభారతి, డా.రాజమాణిక్యం, డా.ఈశ్వరాంబ, డా.రత్నశేఖర్, డా.యోగవెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ద్వైవార్షిక నివేదిక విడుదల చేసిన సీడీఆర్ఏ పయనీర్స్

విశాలాంధ్ర – విశాఖ సిటీ: కోయలిషన్ ఫర్ డిజాస్టర్ రెసిలెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (సీడీ అర్ఐ) తమ ప్రతిష్టాత్మక కార్యక్రమం – గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రెసిలెన్స్‌పై ద్వైవార్షిక నివేదిక: క్యాప్చరింగ్ ది రెసిలెన్స్ డివిడెండ్ ను విడుదల చేసింది. కేంద్ర మంత్రి – మినిస్ట్రీ అఫ్ ఎర్త్ సైన్స్ కిరణ్ రిజిజు ఒక ఉన్నత స్థాయి కార్యక్రమంలో ఈ నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భముగా ద్వైవార్షిక నివేదిక యొక్క ప్రాముఖ్యత గురించి సీడీ అర్ఐ డైరెక్టర్ జనరల్, అమిత్ ప్రోతి వెల్లడించగా , కో-చైర్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు , కమల్ కిషోర్ మాట్లాడుతూ, "దేశాలు తమ నిర్ణయాలను తెలియజేయడానికి, వారి మౌలిక సదుపాయాల పెట్టుబడి నిర్ణయాలను తెలియజేయడానికి మరియు స్థిరమైన పెట్టుబడి పెట్టడానికి లోతైన విశ్లేషణ చేయడానికి ఉపయోగించే ఒక సాధనంతో పాటు నివేదికను అందించారన్నారు. నివేదిక యొక్క కోఆర్డినేటింగ్ లీడ్ ఆథర్, ఆంద్రూ మాస్క్రే పాల్గొన్నారు.

డెటాల్ 'బనేగా స్వస్త్ ఇండియా'కి ప్రచారకర్తగా ఆయుష్మాన్ ఖురానా

విశాలాంధ్ర –విశాఖపట్నం: భారతదేశపు అత్యంత విశ్వశనీయమైన న్యూస్ నెట్ వర్క్, ఎన్ డీ టీ వీ విజయ వంతమైన 10వ సీజన్ 'బనేగా స్వస్త్ ఇండియా' తో మళ్లీ వచ్చింది. ఇది భారతదేశపు అతి పెద్ద ప్రజా ఆరోగ్యం గురించిన ప్రచారం. భారతదేశం వ్యాప్తంగా ఆరోగ్యం, సంక్షేమం మరియు ఐక్యతలను ప్రోత్సహించడానికి ఈ మైలురాయి సమయం ఒక దశాబ్దపు అచంచలమైన నిబద్ధతకు చిహ్నంగా నిలిచింది. బనేగా స్వస్త్ ఇండియా' డెట్టాల్ భాగస్వామ్యంతో ఎన్ డీ టీ వీ లో తొమ్మిదేళ్ల క్రితం ఆరంభమైంది.

మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర – యస్. రాయవరం : మండలంలో కొరుప్రోలు గ్రామంలో ఒక వ్యక్తి మనస్థాపం తో ఆత్మహత్య చేసుకున్న సంఘటన జరిగింది. స్థానిక ఎస్ఐ పొన్నాడ ప్రసాదరావు అందించిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బత్తిన రాజుకు మరిన్ని లోవరాజు మధ్య బుధవారం రాత్రి గొడవ జరిగిందని అన్నారు. అయితే లోవరాజు పెద్ద మనుషులకి చెపుతాడని తెలిసింది. దీంతో రాజు ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడు భార్య నూక రత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆంధ్రప్రదేశ్‌కు జగన్ చేసిన అభివృద్ధిని చాటి చెప్పాలి

విశాలాంధ్ర – నర్సీపట్నం: ఆంధ్ర ప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే....అనే కార్యక్రమాన్ని అమలుచేయడంలో భాగముగా నిర్వహిస్తున్న మండల స్థాయి శిక్షణ కార్యక్రమం గొలుగొండ మండలానికి సంభందించి నర్సీపట్నం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అద్యక్షులు లెక్కల సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నర్సీపట్నం శాసనసభ్యులు ఉమా శంకర గణేష్ ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలంటే అనే ప్రచారం, జగనన్న ప్రభుత్వం చేసిన నిజమైన అభివృద్ధిని ప్రతి ఇంటికి తీసుకెళ్లేందుకు వైయెస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు, గృహ సారథులు మరియు వాలంటీర్లు చేపడుతున్న కార్యక్రమం. ఈ ప్రచారం ద్వారా, "2024 ఎన్నికలకు, మళ్ళీ బూటకపు హామీలతో వస్తున్నావు. నీ అబద్దాలు మాకు తెలుసు . నిన్ను నమ్మం చంద్రబాబు" అన్న కీలక సందేశాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్ళాలి అని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, జెడ్పీటీసీ సుర్ల వెంకట గిరిబాబు, ఎంపీపీ మణికుమారి, సుజాత, యూత్ ప్రెసిడెంట్ రామకృష్ణం నాయుడు, రైతు సంఘం నాయకులు పోలిరెడ్డి రాజుబాబు, బీసీ సెల్ అధ్యక్షులు, ఎస్టీ సెల్ అధ్యక్షులు, సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ మండల వైయెస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, గృహ సారథులు, వాలంటీర్స్ అధిక సంఖ్యలో ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.